# రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు శ్రీరామరక్ష
- మంత్రి సబితాఇంద్రారెడ్డి
- గ్రీన్ టవర్ అపార్ట్‌మెంట్స్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 13: రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు శ్రీరామరక్ష అని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ హరిపురి కాలనీ రోడ్డు నం.1లోని గ్రీన్ టవర్స్ అపార్ట్‌మెంట్స్ వాసుల ఆత్మీయ సమ్మేళనం నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు పటేల్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెట్రోతో అభివృద్ధి శరవేగంగా జరగనుందని తెలిపారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, బస్తీల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి కేటీఆర్ ప్రతి డివిజన్‌కు ఒక వార్డు కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేశ్, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిలారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్ గౌడ్, రామ్‌నర్సింహాగౌడ్, రమేశ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, ఎం.ఏ.సాజీద్, యాదవరెడ్డి ఉన్నారు.

### మంత్రి సబితాఇంద్రారెడ్డికే బ్రాహ్మణుల మద్దతు

బ్రాహ్మణుల సంక్షేమానికి పాటుపడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డికే ఈ ఎన్నికల్లో బ్రాహ్మణులంతా మద్దతు తెలుపుతున్నారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ తెలిపారు. సోమవారం ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. మంత్రి సబితాఇంద్రారెడ్డికి మద్దతుగా బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 18న బడంగ్‌పేట్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి బ్రాహ్మణులు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మంగు రాఘవరావు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కోటర్, యాదగిరిరావు, నారాయణరావు, పీవీజీకే పూర్తి, రామారావు, మంత్రి రవీందర్‌రావు, శ్యాంసుందర్‌రావు, శ్రీమన్నారాయణ, అనురాధ, అన్నపూర్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మలకు అండగా నిలుస్తాం

**బహుజనులే బీఆర్ఎస్ ప్రాణం - మంత్రి కేటీఆర్**




హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా విశ్వకర్మల చేతివృత్తులను ఆధునీకరించి వారి నైపుణ్యాలను విశ్వవ్యాప్తం చేస్తామని బీ ఆర్ ఎ స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హామీ ఇచ్చారు. విశ్వబ్రాహ్మణ సమాజం 60 ఏండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను గత ఏలికలు విస్మరించారని, వాటన్నింటినీ కేసీఆర్ మాత్రమే సమర్థంగా పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. కేటీఆర్‌ను సోమవారం ప్రగతిభవన్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ప్రత్యేకంగా కలిసి విశ్వబ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నేత, గీత కార్మికులకు ఇస్తున్నట్టుగా యాభై ఏండ్లు దాటిన విశ్వబ్రాహ్మణులకు పెన్షన్‌స్కీమ్ వర్తింపజేయాలని, విశ్వకర్మ చేతివృత్తిదారులకు 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, విశ్వకర్మలు ఏ కారణం చేతనైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేయాలని కోరారు. అందుకు మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. విశ్వకర్మీయుల ఉత్పత్తులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా వారి నైపుణ్యాలు మెరుగుపడి వారు ఉత్పత్తి శక్తులుగా ఎదుగుతారని, అందుకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. విశ్వకర్మలకు దేశంలో ఎక్కడాలేని విధంగా రాజధానిలో ఐదు ఎకరాల స్థలమిచ్చి ఆత్మగౌరవ భవన నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వమే చేపట్టిందని, భవిష్యత్‌లో ఈ ఆత్మగౌరవ భవనాలు చేతివృత్తుల జ్ఞాన కేంద్రాలుగా, సాంకేతిక జ్ఞానంతో పొద్దుపొడిచే అభివృద్ధి కేంద్రాలుగా వెలుగొందుతాయని వివరించారు. విశ్వబ్రాహ్మణులతోపాటు మొత్తం బహుజనవర్గాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కడుపులో పెట్టి దాచుకుంటుందని తెలిపారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంకలనం చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు విశ్లేషణ 'కాంగ్రెస్ చేసిందేంది?' అనే పుస్తకాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఏం వెలగబెట్టిందో ఈ పుస్తకం బయటపెట్టిందని వివరించారు. డిసెంబర్ 3న తెలంగాణ అంతా గులాబీమయం కాబోతున్నదని చెప్పారు.

# బీఆర్ఎస్‌కే మా మద్దతు

- కాలయాపన కోసమే ఎస్సీ వర్గీకరణపై కమిటీలు,కమిషన్లు
- మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేశ్ మాదిగ



విలేకరుల సమావేశంలో అభివాదం చేస్తున్న బీఎన్ రమేశ్ మాదిగ, బీఆర్ఎస్ నాయకులు

చిక్కడపల్లి, నవంబర్13: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మహాజన పోరాట సమితి(ఎంపీఎస్) సంపూర్ణ మద్దతు తెలుపుతోందని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎన్.రమేశ్ కుమార్ మాదిగ తెలిపారు. ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు తాము ప్రచారం చేస్తామని తెలిపారు. సోమవారం గాంధీనగర్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కాలయాపన కోసమే కేంద్రంలోని బీజేపీ.. కమిషన్లు, కమిటీలు వేస్తామని ప్రకటించిందని మండిపడ్డారు. ప్రధానమంత్రి మోదీ ఇటీవల నగరంలో జరిగిన మహాసభలో ఎస్సీ వర్గీకరణకు కమిషన్ వేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని, గతంలో అనేక కమిటీలు, కమిషన్లు వేసినా వాటి ద్వారా ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినా నేటి వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ విషయాన్ని పరిష్కరిస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. రాష్ట్రంలో 18 ఎస్సీ నియోజకవర్గాలు, 9 ఎస్టీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అలాగే ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ గెలుపునకు తాము ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సురేశ్ మాదిగ, చిరంజీవి మాదిగ, సమయ్య, ఎస్.రాంచందర్, కిరణ్, వెంకటయ్య, కరుణాకర్, విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జీలు అజయ్ ముదిరాజ్, శ్రీనివాస్, ముఠా నరేశ్, శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్, రాజ్‌కుమార్, సాయి, పీఎస్ శ్రీనివాస్.వై. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బందికి నియోజకవర్గాల కేటాయింపు

**రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి ❖ ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్**

సిటీబ్యూరో, నవంబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న జరిగే పోలింగ్ కోసం సిబ్బందికి నియోజకవర్గాల కేటాయింపు ర్యాండమైజేషన్ ప్రక్రియను.. ఆయా నియోజకవర్గాలకు నియమించిన ఎన్నికల పరిశీలకుల సమక్షంలో సోమవారం జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ పూర్తి చేశారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో అవసరమైన పోలింగ్ అధికారులను, సిబ్బందిని కేటాయిస్తూ రెండో దశ ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా మహిళా నిర్వహణలో 75 పోలింగ్ స్టేషన్లు, 15 పీడబ్ల్యూడీ చొప్పున మరొక 15 యూత్ మేనేజ్‌మెంట్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు 75 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి వివరించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాలకు ఎన్నికల సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు యతీంద్రప్రసాద్, సమీర్‌వర్మ, కవిత రాము, గాయత్రీ కృష్ణ, దీపాంకర్ సిన్హా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్ ఉపేందర్ రెడ్డి, స్నేహ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# 103 నామినేషన్లు తిరస్కరణ

సిటీబ్యూరో, నవంబర్ 13 : శాసనసభ ఎన్నికల ఘట్టంలో కీలకమైన నామినేషన్ల పరిశీలన పూర్తయింది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 438 అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అత్యధికంగా నాంపల్లిలో 45 మంది, జూబ్లీహిల్స్‌లో 40 మంది నామినేషన్లు వేశారు. అత్యల్పంగా బహదూర్‌పురలో 16 మంది, సికింద్రాబాద్-కంటోన్మెంట్‌లో 18 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో భాగంగానే అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల దరఖాస్తులను ఎన్నికల అధికారులు సోమవారం పరిశీలించారు. 438 అభ్యర్థుల్లో 103 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో అత్యధికంగా ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. 335 మంది అభ్యర్థుల నామినేషన్లు అర్హత సాధించాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. ఉపసంహరణ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థులు ఎంతమందో తేలనుంది.

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 71 నామినేషన్ల తిరస్కరణ

మేడ్చల్, నవంబర్13(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలో దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో 71 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుతుబ్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 261 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. స్క్రూటినీలో 71 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 190 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయినట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు.

# దీపావళి సందర్భంగా పలు చోట్ల విషాదం

- 67మందికి కళ్లకు గాయాలు
- 12మందికి ఒంటిపై గాయాలు
- సరోజిని, ఉస్మానియా దవాఖానల్లో చికిత్స

సిటీబ్యూరో/మెహిదీపట్నం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రమాదవశాత్తు దీపావళి పండుగ సందర్భంగా పలు చోట్ల విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. పటాకులు కాలుస్తూ కొందరు, దీపాలు వెలిగిస్తూ కొందరు, ఇతర కారణాలతో మరికొందరు కాలిన గాయాలకు గురయ్యారు. ఈ క్రమంలో 67మంది కళ్లు దెబ్బతినడంతో సరోజినీ కంటి దవాఖానను ఆశ్రయించారు. ఆదివారం 50మంది బాధితులు రాగా, సోమవారం 17మంది బాధితులు సరోజిని దవాఖానకు చికిత్స కోసం వచ్చినట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. మొత్తం 67మంది బాధితుల్లో 62 మందికి ఓపీ ద్వారా చికిత్స అందించినట్లు సరోజిని వైద్యులు వెల్లడించారు. 9మందికి తీవ్రంగా గాయాలు కావడంతో వారిని దవాఖానలో అడ్మిట్ చేసినట్లు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిలో బాచుపల్లికి చెందిన ఐదు సంవత్సరాల ఎం.క్రిష్ణ, సిద్దిపేటకు చెందిన పదకొండేళ్ల రిగ్విద్, శివశంకర్, నాగ్‌నాథ్, జోసెఫ్, సమీర్, సుమన్ కుమార్, రాహిల్, వైష్ణవి ఉన్నారు. కాగా కిష్ణ, రిగ్విద్ మినహా మిగిలిన 7మందిని సోమవారం సాయంత్రం డిశ్చార్జి చేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డా.రాజలింగం వెల్లడించారు.

### ఉస్మానియా దవాఖానలో....

నాంపల్లి ఘటనలో తీవ్రంగా గాయపడిన దుల్హర్(18)కు మెరుగైన చికిత్స అందిస్తున్నామని, బాధితుడికి 75శాతం కాలిన గాయాలైనట్లు ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.నాగేందర్ వెల్లడించారు. ఈ ఘటనలో మృతిచెందిన 9మందికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. అంతే కాకుండా దీపావళి రోజున పటాకులు పేలుస్తూ ఒంటిపై కాలిన గాయాలకు గురైన 12మందికి చికిత్స అందించినట్లు వెల్లడించారు.